

బాల్యవివాహాల నిరోధానికి చర్యలు

భీమడోలు:బాల్య వివాహాల నిరోధానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు భీమడోలు తహశీల్దార్ షంషుద్దీన్ తెలిపారు. ఐసిడిఎస్, స్వచ్ఛంద సంస్థ క్రాప్ ఆధ్వర్యాన ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులతో ఆయన మండలస్థాయి సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి అధికారులు అప్రమత్తత వల్ల మండల పరిధిలో ఫిబ్రవరిలో రెండు, మార్చిలో ఇప్పటి వరకూ ఇంతవరకు ఒక బాల్య వివాహాలను ఆపినట్లు తెలిపారు. బాధ్యులకు కౌన్సిలింగ్ నిర్వహించామన్నారు. బాల్యవివాహాలు జరిపితే చట్టప్రకారం తీసుకునే చర్యల గురించి వివరించామన్నారు .ఇదే క్రమంలో బాల్య వివాహాలు జరిగితే స్థానిక బాల్య వివాహ నిషేధ అధికారులు బాధ్యత వహించవలసి ఉంటుందని తెలిపారు.ఈ సందర్భంగా క్రాప్ డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబి మాట్లాడుతూ, బాలల సమస్యలు ,,బాల్యవివాహాల వల్ల. కలిగే ఇబ్బందులు పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కల్పించుకోవాలని కోరారు.

మొక్కజొన్న రైతు మొర..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'నూజివీడు మండలం పోలసానిపల్లికి చెందిన రైతు వేమూల వెంకట్రావు ఏడెకరాల్లో ఓ ప్రముఖ కంపెనీ ఇచ్చిన మొక్కజొన్న సీడ్స్ సాగు చేశారు. ఎకరాకు నాలుగు నుంచి ఆరు టన్నుల దిగుబడి వస్తుందని కంపెనీ ప్రతినిధులు చెప్పి సీడ్స్ ఇచ్చారు. తీరా పంట చేతికొచ్చే సమయానికి ఎకరాకు రెండు టన్నులు కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురైన రైతు వెంకట్రావు గుళికలు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.'

'మొక్కజొన్న సీడ్స్‌కు చెందిన ఓ కంపెనీ ఇచ్చిన విత్తనాలను నూజివీడు మండలం గొల్లపల్లి పరిసర ప్రాంత రైతులు సాగు చేశారు. నాలుగు టన్నులకుపైగా రావాల్సిన దిగుబడి కాస్తా టన్ను రావడమే గగనంగా మారడంతో రైతులు రోడ్డెక్కి 14 గంటలపాటు ఏపి రైతుసంఘం ఆధ్వర్యంలో నిరవధిక ధర్నా నిర్వహించారు.'

పైన పేర్కొన్న రెండు ఘటనలే కాదు.. కంపెనీలకు సంబంధించిన సీడ్స్ సాగు చేసి నష్టపోయిన ఎంతోమంది రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. మొక్కజొన్న సీడ్స్ కంపెనీలపై ప్రభుత్వ అజమాయిషీ లేకపోవడంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లు పరిస్థితి తయారైంది. ఏలూరు జిల్లాలో దాదాపు లక్ష ఎకరాల్లో మొక్కజొన్నను రైతులు సాగు చేశారు. దీనిలో దాదాపు 65 వేల ఎకరాల్లో కంపెనీలు ఇచ్చిన సీడ్స్‌ని రైతులు సాగు చేశారు. సీడ్స్ ఇచ్చేటప్పుడు ఎకరాకు నాలుగు నుంచి ఆరు టన్నుల దిగుబడి వస్తుందని కంపెనీ ప్రతినిధులు రైతులకు చెప్పి అంటగడుతున్నారు. మూడు నెలల తర్వాత పంట చేతికొచ్చే సమయానికి రెండు టన్నులు కూడా రావడం లేదు. నిబంధనల ప్రకారం సీడ్స్ సాగు చేసిన రైతు నష్టపోతే విత్తనాలు ఇచ్చిన కంపెనీలే రైతులను ఆదుకోవాలి. ఎక్కడా అటువంటి పరిస్థితి లేకుండాపోయింది. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వమేనని చెప్పొచ్చు. కంపెనీలు రైతులకు సీడ్స్ ఇచ్చేటప్పుడు అధికారులు జోక్యం చేసుకుని అగ్రిమెంట్లు రాయించే విధంగా చర్యలు తీసుకోవాలి. సీడ్స్



కంపెనీలపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. ప్రతియేటా రైతులు తీవ్రంగా నష్టపోతున్న సీడ్స్ కంపెనీలు తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నాయి. ఎంఎల్ఎలు, ఎంపిలు సైతం రైతుల గురించి పట్టించుకోకపోవడం సీడ్స్ కంపెనీల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండాపోయింది. రైతుసంఘాలు జోక్యం చేసుకుంటే రైతులకు ఎంతోకొంత న్యాయం జరిగే పరిస్థితి ఉంది. ప్రభుత్వ అధికారులు నష్టపోయిన రైతుల గురించి ఏమాత్రం పట్టించుకోని దుస్థితి నెలకొంది. నష్టపోయిన రైతులు ఆందోళనలకు దిగుతుండగా, మరికొన్నిచోట్ల సీడ్స్ కంపెనీల దురాగతాలను రైతులు మౌనంగా భరిస్తున్నారు. నూజివీడు మండలంలో జరిగిన ఘటనల్లో ఏపి రైతుసంఘం నాయకులు జోక్యం చేసుకుని రైతులకు ఎంతోకొంత న్యాయం జరిగేలా చేశారు. ఇప్పటికైనా రైతులతో అగ్రిమెంట్లు చేసే విధంగా సీడ్స్ కంపెనీలకు నిబంధనలు అమలు చేయకపోతే మొక్కజొన్న రైతుల పరిస్థితి మరింత దారుణంగా తయారు కానుంది. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని మొక్కజొన్న రైతులకు న్యాయం చేయాలని అంతా కోరుతున్నారు.

కంపెనీ సీడ్స్‌తో తీవ్రంగా నష్టపోతున్న రైతులు
నాణ్యత లేని సీడ్స్‌తో రెండు టన్నులూ రాని దిగుబడి
సీడ్ కంపెనీలపై కొరవడిన ప్రభుత్వ పర్యవేక్షణ
ఆశాజనకంగా కమర్షియల్ పంట ధర
పంట చేతికొచ్చే తరుణంలో ధర నిలకడపై రైతుల్లో గుబులు

కమర్షియల్ పంట ధర ఆశాజనకం

జిల్లాలో దాదాపు 35 వేల ఎకరాల్లో మొక్కజొన్న కమర్షియల్ సీడ్‌ను రైతులు సాగు చేశారు. కొద్దిరోజుల్లో పంట చేతికిరానుంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర మొక్కజొన్న కమర్షియల్ పంటకు క్వింటాకు రూ.1962 ఉండగా ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో క్వింటా రూ.2300 నుంచి రూ.2500 వరకూ పలుకుతోంది. పంట చేతికొచ్చే సమయంలో వ్యాపారులు ధర తగ్గించేస్తారేమోనని భయం రైతులను వెంటాడుతోంది. దీంతో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలనే అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. ప్రభుత్వ మద్దతు ధరకంటే బహిరంగ మార్కెట్లో ధర తక్కువగా ఉంటే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ఆలోచన చేసే పరిస్థితి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకూ ఇబ్బంది లేకపోయినా ముందుముందు ఇబ్బంది రాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

మొక్కజొన్న కంపెనీలపై ప్రభుత్వ అజమాయిషీ ఉండాలి

నిమ్మగడ్డ నరసింహులు, ఏపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు

మొక్కజొన్న సీడ్స్ కంపెనీలపై ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సీడ్స్ కంపెనీలపై ప్రభుత్వ పర్యవేక్షణ ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలి. సీడ్స్ కంపెనీలతో ఒప్పందాలు(అగ్రిమెంట్లు) చేసుకునేలా రైతుల్లో అవగాహన పెంచాలి. నష్టపోయిన రైతులను ఆదుకునే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కమర్షియల్ సాగు రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

గ్యాస్ ధరల పెంపుపై నిరసన

ప్రజాశక్తి - టి.నరసాపురం

గ్యాస్ ధరలు తగ్గించాలని కోరుతూ అల్లూరి సీతారామరాజు నగర్ జంక్షన్ వద్ద ఐద్వా ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఖాళీ గ్యాస్ సిలిండర్, కట్టెలతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వంట గ్యాస్‌పై ఒకేసారి రూ.50 పెంచడం అన్యాయమన్నారు. నిత్యావసర వస్తువుల ధరలకు అడ్డూఅదుపు లేకుండా పోయిందన్నారు. ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మడకం కుమారి, రైతు సంఘం మండల కార్యదర్శి అనుమోలు మురళీ, వి.లక్ష్మి, బి.కుమారి పాల్గొన్నారు.



టి.నరసాపురంలో..



కలిదిండిలో..

కలిదిండి:పెంచిన గ్యాస్ ధరలకు నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో కలిదిండి ప్రధాన సెంటర్‌లో ఖాళీ గ్యాస్ బండలు, కట్టెలతో ధర్నా చేపట్టారు. ప్రధాన సెంటర్ నుండి పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. బిజెపి అధికారంలోకి రాకముందు రూ.400 ఉన్న సిలిండర్ ధర ప్రస్తుతం రూ.1155 కు చేరిందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే పెరిగిన గ్యాస్ బండ ధరలు సామాన్యులకు గుదిబండగా మారాయన్నారు. ఈ ధరలను ఉపసంహరించుకోవాలని, డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు, కార్యకర్తలు వీరవల్లి భాస్కరరావు, కుడిపూడి శ్రీనివాసరావు, పెరుమాల రమేష్, పి.ప్రకాష్, జోగి ఏసు, పెరుమాళ్ల సత్యనారాయణ, జక్కుల మహేష్, గద్దె అనిల్ కుమార్, అబ్దుల్ హకీమ్, కాంగ్రెస్ నాయకులు మారుబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముసునూరు:గ్యాస్ ధరలను తగ్గించాలని సిపిఎం జిల్లా నాయకులు జి.రాజు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మండపం సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పిల్లి మురళీ, చిలకబత్తుల శ్రీను, కంచర్ల దుర్గారావు, కంచర్ల శ్రీను, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి

ప్రజాశక్తి - ఏలూరు

బాలలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రత్యేక పోలీస్, బాలల సంక్షేమ, ప్రత్యేక బాలల న్యాయమూర్తుల కమిటీలపై ఆధారపడి ఉందని మొదటి అదనపు జిల్లా జడ్జి పి.మంగకుమారి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ప్రత్యేక బాలల పోలీస్ యూనిట్, ప్రత్యేక బాలల న్యాయమూర్తుల విభాగం, బాలల సంక్షేమ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి పి.మంగకుమారి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని మనమందరం గుర్తుంచుకోవాలని, రాజ్యాంగం ప్రకారం పిల్లల హక్కుల పరిరక్షణకు 2015లో పోక్సో చట్టం తీసుకువచ్చారని తెలిపారు. సరైన సంరక్షణ, అభివృద్ధి, చికిత్స, సాంఘీక పున:నిర్మాణం ద్వారా వారి ప్రాథమిక అవసరాలు తీర్చడం కోసం ఈ చట్టం రూపొందించారని తెలిపారు. చట్టంతో విభేదించిన పిల్లలు, సంరక్షణ అవసరమైన పిల్లలకు జువైనల్ జస్టిస్ చట్టం రూపొందించారన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పోక్సో, పిల్లల సంరక్షణ చట్టం 2015, బాల్య సంక్షేమంపై శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోక్సో స్పెషల్ జడ్జి ఎస్.ఉమాసునంద మాట్లాడుతూ పోక్సో చట్టం అమల్లో అవరోధాలు రాకుండా చట్టంలో చెప్పిన విధంగా పిల్లల సంరక్షణకు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు మాట్లాడుతూ కాలానుగుణంగా మార్పులు వస్తున్నాయని మానవత దృక్పథంతో పోలీసు అధికారులు పిల్లల సంరక్షణ చూడాలన్నారు. పోలీసు స్టేషన్లో చట్టప్రకారం ప్రత్యేక ప్రొటెక్షన్ గది ఉందని, వారి బాధ్యతను సొంత పిల్లలుగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీగ్రేస్ కుమారి మాట్లాడుతూ పోక్సో యాక్ట్‌పై నిర్వహిస్తున్న శిక్షణ ద్వారా వృత్తిలో నైపుణ్యం పెంచుకోవడానికి, ఈ శిక్షణ అవసరమని చెప్పారు. పిల్లలకు నష్టపరిహారం చెల్లించడంలో చైల్డ్ వెల్ఫేర్ పాత్ర, పిల్లల పరిరక్షణకు పోలీసు వారి పాత్ర గురించి చట్టంలో పొందుపరచిన అంశాలను తెలియజేశారు. శిక్షణ అనంతరం యూనిట్ సభ్యులకు న్యాయమూర్తులు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి డి.శ్రీనివాసులు, బార్ అసోషియేషన్ సెక్రటరీ సుబ్బారావు, సిడబ్ల్యుసి చైర్‌పర్సన్ బి.రిబ్కారాణి, ఇంప్లిమెంటేషన్ జెజె యాక్ట్ చట్టం డిపిఒ జె.దుర్గాప్రసాద్, మాస్టర్ ట్రైనర్ తెగిరిపల్లి సుబ్బారావు, డిఎస్‌పి పైడేశ్వరావు, సిఐలు, ఎస్ఐలు, యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం సర్పంచికి జాతీయస్థాయి అవార్డు

బుట్టాయగూడెం:జలశక్తి అభియాన్ కింద రూఫ్ టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, సాంప్రదాయ వర్షపు నీటి సేకరణ నిర్మాణాలు చేపట్టినందుకు జిల్లాకు చెందిన బుట్టాయగూడెం గ్రామ సర్పంచి తెల్లం వెంకాయమ్మకు జాతీయస్థాయి అవార్డు దక్కింది. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో శనివారం రాష్ట్రపతి ద్రౌపదిముర్ము పాల్గొన్న స్వచ్ఛ సుజల్ శక్తి సమ్మాన్-2023 ఉమెన్ లీడర్ షిప్ ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి గజేందర్‌సింగ్ షెకావత్ ద్వారా సర్పంచి వెంకాయమ్మ అవార్డు స్వీకరించారు. జల్ శక్తి అభియాన్‌లో తన ఆదర్శవంతమైన పనితీరు, విశిష్ట సహకారాన్ని అందించినందుకు, అంతర్జాతీయ ఉమెన్స్‌డేను పురస్కరించుకుని ఈ అవార్డును ఆమె అందుకున్నారు. ఉపాధి హామీ చట్టం ద్వారా నీటి సేకరణ, సంరక్షణ పనులు చేపట్టినందుకు ఈ అవార్డు దక్కింది. ఆమెతోపాటు ఈ కార్యక్రమంలో డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ దుండి రాంబాబు, జంగారెడ్డిగూడెం క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.ప్రఫుల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి జె.కిరణ్ పాల్గొన్నారు.స్వచ్ఛ భారత్, జలజీవన్ మిషన్, జలశక్తి అభియాన్ రంగాల్లో కృషి చేసిన వారిలో దేశంలో 36 మందికి ఈ అవార్డులు అందించగా మన రాష్ట్రం నుండి మన జిల్లాకు రావడం ఆనందించాల్సిన విషయమని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. ఈ సందర్భంగా బుట్టాయగూడెం గ్రామ సర్పంచి తెల్లం వెంకాయమ్మకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. అదే విధంగా జాయింట్ కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఇతర జిల్లా అధికారులు అవార్డు వచ్చిన సందర్భంగా శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.

స్కానింగ్ కేంద్రాల తనిఖీ

ఏలూరు:జాతీయ మహిళా దినోత్సవం, బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలను సంబంధిత అధికారులు తనిఖీ చేశారు. ఏదైనా అనాధికారిక స్కానింగ్ కేంద్రాలు, డయాగ్నోస్టిక్ కేంద్రాలను గుర్తించే క్రమంలో ఏలూరు ఆర్ఆర్ పేటలోని వీనస్ స్కానింగ్ సెంటర్, సుస్మిత డయాగ్నోస్టిక్ సెంటర్లను సంబంధిత అధికారులు శనివారం తనిఖీ చేసి రికార్డులు, రిపోర్టులను పరిశీలించారని, యుపిహెచ్‌సి ఎన్ఆర్.పేట మెడికల్ ఆఫీసరు అమర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలను చేయించిన, చేయించుకున్న వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ప్రక్రియలో ఎవరైనా మొదటిసారి పట్టుబడితే మూడేళ్ల జైలు, రూ.పది వేలు జరిమానా, రెండోసారి పట్టుబడితే ఐదేళ్ల జైలు శిక్ష, రూ.50వేలు జరిమానా విధిస్తామని తెలిపారు. మూడోసారి పట్టుబడితే ఐదేళ్ల జైలు, రూ.50 వేలు జరిమానాతోపాటు డాక్టర్ సర్టిఫికెట్‌ను శాశ్వతంగా రద్దు చేస్తామని తెలిపారు. చట్టానికి వ్యతిరేకంగా ఎవరైనా స్కానింగ్ కేంద్రాలు, డయాగ్నోస్టిక్ సెంటర్లు, లాబ్స్, ఆసుపత్రులను నిర్వహిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ తనిఖీల్లో వైద్యులు రోహిత్, దివ్య, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి


టి.నరసాపురం:సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని లీడ్ బ్యాంక్ సమన్వయకర్త విశ్వప్రసాద్ సూచించారు. మండలంలోని బొర్రంపాలెంలో కెనరా బ్యాంక్ వద్ద శనివారం ఏలూరు లీడ్ బ్యాంక్ వారి సహకారంతో ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులు బ్యాంక్ ఆన్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. ఎప్పటికప్పుడు సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఖాతాదారులు అప్రమత్తంగా లేకుంటే నష్టపోవాల్సి వస్తుందన్నారు. వ్యక్తిగత వివరాలు ఎవరికీ చెప్పొద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సీనియర్ మేనేజర్ గాజుల గణేష్, మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు

కార్మికులు, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, బిజెపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా వచ్చేనెల ఐదో తేదీన చేపడుతున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, ఎపి రైతు సంఘం, ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా కమిటీలు పిలుపునిచ్చాయి. స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో కరపత్రాలను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాసంపద మొత్తం పెట్టుబడిదారులు, కార్పొరేట్లు దోచుకుంటున్నారన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టి రైతులను బిచ్చగాళ్లుగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలకు రక్షణగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. కౌలురైతులకు రక్షణ లేదన్నారు. దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీలపై దాడులు పెరిగిపోతున్నాయని, రాష్ట్రాల హక్కులను కేంద్ర ప్రభుత్వం హరిస్తోందని విమర్శించారు. కేంద్రం విధానాలతో రాజ్యాంగం పెనుప్రమాదంలో పడిందని, యువత భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని చెప్పారు. ఈ ప్రజావ్యతిరేక, మతోన్మాద, నియంతృత్వ బిజెపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పకుంటే దేశ సంపద అదానీ, అంబానీల చేతుల్లోకి వెళ్లిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక, కర్షక ఐక్యతతో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. చలో ఢిల్లీ విజయవంతం చేయాలని కోరుతూ దశలవారీగా ఇంటింటా ప్రచార, జాతాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్.లింగరాజు, ఎం.నాగమణి, బి.సోమయ్య, కె.విజయలక్ష్మి, ఆర్‌విఎస్.నారాయణ, కె.వెంకట్రావు పాల్గొన్నారు.

వైసిపి హయాంలో పడకేసిన ప్రాజెక్టులు



చింతలపూడి ఎత్తిపోతల కాలువను పరిశీలిస్తున్న రామకృష్ణ

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - చింతలపూడి

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎత్తిపోతల ప్రాజెక్టులన్నీ పడకేశాయని, ముఖ్యంగా చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిగా విస్మరించారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. పోరుబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొమ్ముగూడెంలో చింతలపూడి ఎత్తిపోతల పథకంలో తవ్విన కాలువను రాష్ట్ర కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. రైతులను పలువివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పథకం వల్ల రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, భూ సేకరణ నిలిపివేశారని, అలాగే నష్టపరిహారం అందించడంలో వ్యత్యాసం ఉందని, ఒకచోట ఎకరాకు రూ.12 లక్షలు, మరోచోట రూ.15 లక్షలు ఇచ్చారని రైతులు రామకృష్ణకు వివరించారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ఎత్తిపోతల ప్రాజెక్టుల పరిస్థితి కూడా చింతలపూడిలానే తయారయ్యాయన్నారు. రూ.మూడు వేల కోట్లతో ప్రారంభించిన ఈ ప్రాజెక్టు ఇప్పటికి కనీసం 300 ఎకరాలకు సాగునీరు అందించలేపోయిందన్నారు. నిర్వాసిత రైతులకు న్యాయమైన నష్టపరిహారం కూడా అందించ లేదన్నారు.

ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన భూమి ఇచ్చేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని, అయితే వారు వేరేచోట వ్యవసాయ భూమి కొనుక్కోవడానికి న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కూడా జాతీయ ప్రాజెక్ట్‌గా గుర్తించిన పోలవరానికి కూడా నిధులు ఇవ్వడం లేదన్నారు. ఎన్నికల లబ్ధి ఉంటేనే కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టులను చేపడుతుందని, ఈ క్రమంలో కర్ణాటకలో త్వరలో జరిగే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అక్కడ అప్పర్‌భద్ర ఎత్తిపోతల ప్రాజెక్ట్‌కు సుమారు రూ.ఐదు వేల కోట్లు కేటాయించిందన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలాంటి పరిశ్రమలూ స్థాపించలేదని, ప్రాజెక్ట్‌లు కూడా ఏమీ చేపట్టలేదని విమర్శించారు. వైసిపి నాలుగేళ్ల పాలనపై శ్వేతపత్రం విడుదల చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నేతలు జల్లి విల్సన్, డేగ ప్రభాకర్, డి.శంకర్, మన్నవ కృష్ణచైతన్య, కోటేశ్వరావు, కంచర్ల గురవయ్య, పుల్లారు సోమశేఖర్, తొర్లపాటి బాబు పాల్గొన్నారు.

ఐదు కొండచిలువలు హతం

ప్రజాశక్తి - టి.నరసాపురం

తిరుమలదేవిపేట పంచాయతీ పరిధిలోని మల్లప్పగూడెంలో శనివారం ఐదు కొండచిలువలను గ్రామస్తులు హతమార్చారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గత కొద్ది రోజులుగా ఇళ్లల్లో ఉన్న కోళ్లు మాయం అవుతుండటంతో దొంగలు అనుకుని నిఘా పెట్టారు. దీంతో పెద్ద కొండచిలువ జాతి పాములను గుర్తించి భయభ్రాంతులకు గురయ్యారు. పొలాల మధ్యలో పంట బోదెల వద్ద ఉన్న ఐదు కొండచిలువలను హతమార్చారు. ఈ ఘటన మండలంలో చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా అటవీ ప్రాంతంలో ఉండే పాములు గ్రామాల్లో సంచరించడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. కోళ్లను తినడానికి అవి చాలాకాలం నుంచి తిష్ట వేసిఉండొచ్చని పలువురు చెబుతున్నారు.

'పోలవరం'ను పరిశీలించిన ఉన్నతాధికారులు

ప్రజాశక్తి - పోలవరం



పనుల ప్రగతిని తెలుసుకుంటున్న అధికారులు

పోలవరం ప్రాజెక్టు ప్రాంతాన్ని పిపిఎ, ఎన్‌హెచ్‌పిసి, సిఎస్ఎంఆర్, సిఎండిడి బృందాలు శనివారం పరిశీలించాయి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన డయాఫ్రంవాల్‌కు నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్ అధికారులు నిర్వహించిన సామర్థ్య పరీక్షల ఫలితాలు, నేషనల్ హైడ్రోపవర్ కార్పొరేషన్, డ్యాం డిజైనింగ్ రివ్యూ ప్యానల్ పోలవరం ప్రాజెక్టు అథారిటీ, కేంద్ర సాయిల్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్, సిఎండిడి అధికారులు వెల్లడించనున్న నేపథ్యంలో అధికారుల బృందం పోలవరం ప్రాజెక్టులో పలు ప్రాంతాలను పరిశీలించింది. ఈ బృందాలు ప్రాజెక్టులో డి వాల్ గైడ్ బండ్, స్పిల్‌వే గ్యాలరీ, ఎగువ దిగువ కాపర్‌డ్యామ్‌లు, పైడిపాక మట్టి డంపింగ్ ప్రాంతాలను పరిశీలించారు.

వైసిపి గెలుపునకు కృషి చేయాలి : పుప్పాల

ప్రజాశక్తి - గణపవరం

వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సోషల్ మీడియా ద్వారా ప్రజలకు అందించే సోషల్ మీడియా కన్వీనర్లు మరింత కష్టపడి జగన్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావడానికి కృషి చేయాలని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు(వాసుబాబు) సూచించారు. శనివారం ఉంగుటూరు నియోజకవర్గంలో నూతనంగా ఎంపికైన సోషల్ మీడియా కన్వీనర్లు, కోకన్వీనర్లు భువనపల్లి ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో వాసుబాబుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వాసుబాబు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రగతిని ప్రజలకు చేరవేసే కన్వీనర్లకు కో కన్వీనర్లు రానున్న రోజుల్లో కీలకపాత్ర వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్, ఉంగుటూరు నియోజకవర్గ కన్వీనర్ నెక్కంటి వెంకటేష్ పాల్గొన్నారు.

భారాల మోత కష్టాల మోత

వంటింట్లో మోడీ మంటలు
సాగునీటి కోసం రైతన్నల పడిగాపులు
పునాదులు దాటని ఇళ్ల లబ్ధిదారుల కల



ఓపక్క భారాల మోత.. మరోపక్క కష్టాల మోత.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భారాల మోత మోగిస్తుంటే.. అవేమీ పట్టని రాష్ట్ర ప్రభుత్వం మొద్దునిద్రతో జిల్లా ప్రజలను కష్టాల సుడిగుండంలోకి నెట్టేస్తోంది. గ్యాస్ ధర పెంపు, సాగునీటి కష్టాలు, ఇళ్ల లబ్ధిదారుల అవస్థలు జిల్లావాసులను ఉక్కిరిబిక్కిరి చేశాయి.

ఈశాన్య రాష్ట్రాల ఎన్నికలవ్వగానే మోడీ సర్కార్ పేద, మధ్యతరగతి ప్రజలపై కొరడా ఝుళిపిస్తూ గృహావసరాలు, వాణిజ్య గ్యాస్ ధర పెంచి వంటింట్లో మంట పెట్టింది. గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెంచడంతో జిల్లావాసులు లబోదిబోమంటున్నారు. తమ వేతనాలు, కూలిరేట్లు, పంట ఉత్పత్తుల ధరలు ఏమాత్రం పెరగకపోయినా మోడీ సర్కార్ వచ్చాక గ్యాస్ సిలిండర్ ధర మూడు రెట్లు పెరిగిందని జనం వాపోతున్నారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలు పెరిగి ఉక్కిరిబిక్కిరవుతున్న జనానికి గోరుచుట్టుపై రోకటిపోటులా గ్యాస్ ధర పెంపు పరిణమించిందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. దీనికితోడు అపరాలు, వంట నూనె తదితరాల ధర పెరుగుదల కారణంగా ఇప్పటికే హోటళ్లలో తినుబండారాల ధరలు ఆకాశాన్నంటాయి. తాజాగా గ్యాస్ ధర పెంపుతో మరోసారి తినుబండారాల ధరలు పెరగనున్నాయి. ఫలితంగా జనం కడుపుపై మోడీ ధరాఘాతం తగిలినట్లయ్యింది.

సాగునీటి కోసం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో రైతులు వంతుల సమయంలో పొలాల వద్ద పడిగాపులు పడుతున్నారు. పూర్తిస్థాయిలో సాగునీటిని అందించే పేరుతో వంతుల విధానం అమలు చేస్తున్నా శివారు ప్రాంతాలకు సాగునీరందని దుస్థితి నెలకొంది. ఉండి, కాళ్ల, ఆచంట, పెనుమంట్ర, భీమడోలు తదితర మండలాల్లో ఇప్పటికే సాగునీటి ఎద్దడి తలెత్తడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. ఈ సమయంలో నీటి ఎద్దడి వల్ల దిగుబడి గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు పర్యటించి హడావుడి చేసినా కీలకమైన ఆక్వా చెరువులకు సాగునీటి మళ్లింపును కట్టడి చేయకపోవడంతో పరిస్థితి రోజురోజుకీ ఇబ్బందికరంగా తయారవుతోంది. ఎంఎల్‌సి ఎన్నికల హడావుడిలో మునిగి తేలుతున్న ప్రజాప్రతినిధులు సైతం రైతుల కష్టాలపై దృష్టి సారించకపోవడంతో పంటలు ఎండుతున్నాయి. దీంతో ఆయిల్ ఇంజిన్లు ఏర్పాటు చేసుకుని నీటిని తోడుకుని పంటను రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఫలితంగా రైతులకు పెట్టుబడి ఖర్చు అనూహ్యంగా పెరిగిపోతుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సాగునీటి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జగనన్నా.. ఇటు చూడన్నా..

జగనన్న లే అవుట్లలో ఇళ్ల లబ్ధిదారుల పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యిలా తయారైంది. ఇల్లు కట్టుకుందామంటే లోతట్టు ప్రాంతం కావడం, పూడిక చేశాక ఇల్లు కట్టుకుందామంటే పట్టా రద్దు చేస్తామని అధికారుల హెచ్చరికల నడుమ లబ్ధిదారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇచ్చే కొద్దిపాటి సొమ్ము బేస్‌మెంట్ స్థాయి వరకే సరిపోతుండటం, అప్పు చేస్తేగాని ఇల్లు పూర్తయ్యే పరిస్థితి లేకపోవడంతో లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఫలితంగానే సిపిఎం పరిశీలనలో ఇళ్ల లబ్ధిదారుల సమస్యలు వెలుగుచూశాయి. ఆ పార్టీ పిలుపు మేరకు కలెక్టరేట్, తహశీల్దార్ కార్యాలయాల వద్ద నిర్వహించిన ధర్నాలకు జనం తరలొచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇల్లు కట్టుకోవడానికి సాయం రూ.6 లక్షలకు పెంచడంతోపాటు లేఅవుట్‌లను పూడిక చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

-విఎస్ఎస్‌వి. ప్రసాద్

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - చింతలపూడి

భారత రాజ్యాంగం అందరికీ ప్రాథమిక హక్కులు, బాధ్యతలు ఇచ్చిందని, దానిలో బాగంగా మహిళలకు ఎన్నో హక్కులతో పాటు చట్టాలు కూడా ఇచ్చిందని చింతలపూడి ఫుల్ అడిషనల్ జడ్జి పి.పరేష్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలో అంగన్‌వాడీలకు మహిళ చట్టాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పరేష్‌కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగం సమానత్వం, రిజర్వేషన్స్ ఇచ్చిందని చెప్పారు. మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. భర్త ద్వారా అన్యాయానికి గురైన మహిళలకు న్యాయం చేసేందుకు చట్టాలు ఉన్నాయని తెలిపారు.

శ్రీచైతన్యలో ఘనంగా 'ఫ్యామిలీ గ్లోరీ'

ప్రజాశక్తి - చింతలపూడి

కుటుంబ విలువలు, కుటుంబ వ్యవస్థపై గౌరవం అడుగంటుతున్న నేటి కాలంలో భావిభారత పౌరులైన విద్యార్థుల్లో పెద్దల పట్ల గౌరవ మర్యాదలు పెంపొందించేందుకు శ్రీ చైతన్య యాజమాన్యం ఫ్యామిలీ గ్లోరీ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని శ్రీచైతన్య టెక్నో పాఠశాలలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం ఫ్యామిలీ గ్లోరీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బి.సత్యనారాయణ మాట్లాడుతూ తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో చేర్పించే అహృదయులను సహృదయులుగా మార్చే చిన్న ప్రయత్నమే ఈ కార్యక్రమం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులుకు పువ్వులతో పాద పూజ చేసి, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ ఇన్‌ఛార్జి పార్థసారధి, జోనల్ కో-ఆర్డినటర్ ఉదయభాస్కర్, పాఠశాల డీన్ మధుబాబు, ఎఒ రవీంద్ర పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న మల్లికార్జున, సిబ్బంది

ఘనంగా జాతీయ లైన్‌మేన్ దినోత్సవం


ప్రజాశక్తి - కలిదిండి

జాతీయ లైన్‌మ్యాన్ దినోత్సవం సందర్భంగా స్థానిక విద్యుత్ కార్యాలయంలో ఎఇఇ జి.మల్లికార్జున తన సిబ్బందితో కలిసి శనివారం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. తమ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. అంకిత భావంతో పనిచేస్తే ప్రజల మన్ననలు పొందుతామన్నారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలు

ప్రజాశక్తి -ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు కృష్ణాజిల్లా మైలవరం మండలం వెలవడం గ్రామానికి చెందిన లేళ్ల ఏడుకొండలు రూ.1,01,116 దేవస్థానం ఛైర్మన్ ఎస్‌వి.సుధాకరరావుకు అందించారు. హైదరాబాద్‌కు చెందిన ఎం.జగన్నాధరావు రూ.50 వేలు డిడి ఆలయ ఎఇఒ మెట్టపల్లి దుర్గారావుకు అందించారు. ఇరువురు దాతలకు దేవస్థానం వారు బాండ్ పేపర్స్ అందించారు.


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ

ఉప్పాకపాడు పాఠశాలలో తనిఖీలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉప్పాకపాడు పాఠశాలను ఇన్‌ఛార్జి ఎంపిడిఒ యువివి.ఆంజనేయులు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. నాడు-నేడు, జగనన్న గోరుముద్ద, మరుగుదొడ్ల పరిశుభ్రత, పాఠశాలలో జరుగుతున్న నో బ్యాగ్ డే కార్యక్రమం, పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. దీనిపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన ప్రధానోపాధ్యాయులు అల్లు శ్రీను, ఉపాధ్యాయులు మాదు రాణి, మధ్యాహ్న భోజన పథకం సిబ్బందిని, శానిటేషన్ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ శ్రావణ్య, ఇంజినీర్ అసిస్టెంట్, తనూజ, సంక్షేమ కార్యదర్శి జాన్సీ పాల్గొన్నారు.


సాయం చేస్తున్న 'తపన' సభ్యులు

అగ్నిప్రమాద బాధితులకు 'తపన' సాయం

ప్రజాశక్తి - ముసునూరు

అగ్ని ప్రమాద బాధితలకు తపన ఫౌండేషన్ శనివారం ఆర్థికసాయం అందించింది. మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన కంచర్ల ముత్తయ్య, అతని కుమారుడు ఏడుకొండలు ఇళ్లు ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న తపన ఫౌండేషన్ సభ్యులు ఎం.కృష్ణారావు ఒక్కో కుటుంబానికి రూ.పదివేలు ఆర్థిక సాయం, దుస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో బొల్లినేని బుజ్జియ్య, ఉండవల్లి ధర్మారాజు, నందిగం దామోదర్‌రావు, అక్కినేని నాగచందు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

భర్త ఆత్మహత్య

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

దంపతుల మధ్య గొడవల నేపథ్యంలో మనస్తాపానికి గురైన భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. నూజివీడు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మీర్జాపురానికి చెందిన గుంజా గోవిందరాజు, అతని భార్య కొంతకాలంగా గొడవలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన గోవిందరాజు గత నెల 26వ తేదీన పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఇది గమనించిన బంధువులు గోవిందరాజును నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.


విద్యార్థులకు ఎల్ఐసి ఆధ్వర్యంలో ప్రశంసాపత్రాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు


ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

2021 - 22 విద్యా సంవత్సరంలో ఆరు నుంచి పదో తరగతి వరకు ఉత్తమ ప్రతిభ కనబరిచిన కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పది మందికి జీవిత బీమా సంస్థ భీమడోలు బ్రాంచ్ ఆధ్వర్యంలో ప్రశంసాపత్రాలు, షీల్డ్స్ బహూకరించారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు సిహెచ్. శ్రీనివాస్‌కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన భీమడోలు డివిజన్ బ్రాంచ్ మేనేజర్ కె.గోవిందు మాట్లాడుతూ జీవిత బీమా సంస్థ పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. చిన్న వయసు నుంచి పొదుపును అలవాటు చేసుకోవాలన్నారు. బీమాలో పొదుపు చేసుకోవడం వల్ల భవిష్యత్తులో వారిని ఆదుకుంటుందని తెలిపారు. పాఠశాలలో చదువుతున్న ఉత్తమ ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులో కొంతమందికి ఉన్నత చదువులు ఉచితంగా చదివిస్తుందని తెలిపారు.

పిఎం జీవన్ జ్యోతి బీమా యోజనను వినియోగించుకోండి


చెక్కు నమూన అందిస్తున్న దుర్గారావు

ప్రజాశక్తి - మండవల్లి

ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకం ఒక వరం వంటిదని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు అన్నారు. స్థానిక నాగేంద్రస్వామి కళ్యాణ మండపంలో నిర్వహించిన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకం చెక్కుల పంపిణీ నిర్వహించి అనంతరం గ్రామస్తులకు పథకంపై శనివారం అవగాహన కల్పించారు. జీవన్ జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన పథకంలో చేరి సంవత్సరానికి రూ.456 చెల్లిస్తే సహజ మరణానికి రూ.రెండు లక్షలు, ప్రమాద మరణానికి రూ.నాలుగు లక్షలు బీమా ద్వారా ఆ కుటుంబానికి అందించనున్నట్లు తెలిపారు. . జీవన్ జ్యోతి బీమా యోజనలో 18 నుంచి 50 సంవత్సరాలు వయస్సు ఉన్న బ్యాంకు ఖాతాదారులు చేరవచ్చని 55 సంవత్సరాల వరకు పథకం కొనసాగుతుందని చెప్పారు. సురక్ష బీమా యోజన పథకంలో 18 నుంచి 70 మధ్య వయస్సు కలిగిన వారందరూ పథకంలో చేరే అవకాశం ఉందని, ఆటో డెబిట్ ద్వారా బ్యాంకు ఖాతా నుంచి ప్రతి సంవత్సరం డబ్బులు జమ అయ్యే సౌకర్యం కూడా ఉందని ఆయన తెలిపారు.అనంతరం మృతి చెందిన చిన్నారావు భార్య ప్రత్యూషకు రూ.2 లక్షల బీమా చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మెండ ఝాన్సీ, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ ఎల్ఎస్.భాస్కరరావు, బ్యాంకు మిత్ర ఝాన్సీరాణి, యానిమేటర్ శ్యామల, ఎస్.జానకి, డ్వాక్రా మహిళలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం డిగ్రీ కాలేజీ విద్యార్థులకు తృణధాన్యాలపై శనివారం అవగాహన కల్పించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంతో పాటు ఐక్యరాజ్యసమితి 2023ను అంతర్జాతీయ తృణధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన సందర్భంగా కాలేజీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి మాట్లాడుతూ పోషక విలువలు అధిక శాతంగా ఉన్న చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల షుగర్, బిపి వంటి దీర్ఘకాలిక వ్యాధులు దూరమవుతాయన్నారు. రాగులు, సజ్జలు, రాగిసంకటి వంటివి ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి మంచిదని విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు రాయలసీమ ప్రత్యేక వంట రాగిసంకటి, కోడి కూర, రాగి లడ్డు, రాగి కేకు తయారీపై పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహు మతులు అందించారు.



చిరుధాన్యాల వంటకాలను పరిశీలిస్తున్న నిర్మలాకుమారి

అనంతరం కాలేజీ కెమిస్ట్రీ శాఖ తర పున అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. తాడేపల్లి గూడెం ఐఐటి ప్రొఫెసర్ కెకె.సత్యనారాయణ మాలిక్యూల్స్ అండ్ మాలిక్యులర్ ఇంట్రడక్షన్ అంశంపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు, డాక్టర్ చైతన్య, డివిడి.చిన్నసత్యనారాయణ పాల్గొన్నారు.

'వైసిపి ఎంఎల్‌సి అభ్యర్థులను గెలిపించాలి'

ప్రజాశక్తి - గణపవరం

స్థానిక సంస్థల ఎంఎల్‌సి అభ్యర్థులు వంకా రవీంద్ర, కౌరు శ్రీనివాస్‌ను గెలిపించాలని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల శ్రీనివాసరావు(వాసుబాబు) కోరారు. శుక్రవారం రాత్రి వరదరాజపురం కెవిపి ఫంక్షన్ హాలులో జరిగిన ఉంగుటూరు నియోజకవర్గ ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలతో జరిగిన సమావేశంలో ఎంఎల్‌ఎ మాట్లాడారు. సిఎం జగన్ ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాలకు అధిక ప్రాధాన్యత కల్పించారని చెప్పారు. వైసిపి అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఉభయ గోదావరి జిల్లాల వైసిపి రీజనల్ కో ఆర్డినేటర్ పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో 60 శాతం సీట్లు బడుగు బలహీనవర్గాలకు ప్రభుత్వం కల్పించిందన్నారు. శాసన మండలిలోనూ వారికి అత్యధిక ప్రాధాన్యత కల్పించిందన్నారు. వైసిపి ఎంఎల్‌సి అభ్యర్థులు రవీంద్ర, శ్రీనివాసు మాట్లాడుతూ జగన్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. తమకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలో ఉన్న ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు పాల్గొన్నారు.


లబ్ధిదారులతో మాట్లాడుతున్న పివిఎస్.నాయుడు

ఐక్యంగా హక్కులు సాధించుకోవాలి

మండవల్లి: హక్కుల సాధనకు ఎస్‌సిలు కలిసికట్టుగా ఉండి పోరాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు. చావలపాడుకు చెందిన చెందిన మత్తే సత్యానందం చాట్రాయి మండలం టి.గుడిపాడులో చేపల చెరువుపై కాపలాదారుగా పనిచేస్తుండగా హత్యకు గురికావడంతో ఆయన శనివారం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యానందం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తలారి ధనలక్ష్మి, ఎస్‌సి నాయకులు బొడ్డు నోబుల్, మత్య రవి, ప్రవీణ్, సిఐ వైబిఎల్ నాయుడు ఎస్ఐ రామకృష్ణ, కైకలూరు తహాశీల్దార్ మురళీకృష్ణ ఆర్ఐ పద్మరోజ, గ్రామస్తులు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన

ఉంగుటూరు: ఉంగుటూరు టోల్ ప్లాజా వద్ద శనివారం 52వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హైవే సిబ్బందితో పాటు వాహనదారులకు అవగాహన కల్పించారు. ఎక్కడైనా రోడ్డు ప్రమాదాలు జరిగితే వెంటనే ఎలా స్పందించాలని, ఎలా రక్షించాలనే అనే అంశంపై టోల్‌ప్లాజా అధికారులు వివరించారు.

జగనన్న ఇళ్లు త్వరిత గతిన పూర్తిచేయాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మొదటి విడత జగనన్న గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి పివిఎస్.నాయుడు అధికారులకు సూచించారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో గృహ నిర్మాణాల ప్రగతిపై పంచాయతీ, రెవెన్యూ, సచివాలయ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా అవాస్ యోజన పథకంలో మొత్తం 677 ఇళ్లు మంజూరయ్యాయని వాటిని త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని సిబ్బందికి ఆదేశాలిచ్చారు. కొన్ని చోట్ల అసలు నిర్మాణాలు చేపట్టకుండా ఉన్న ఇళ్లను గుర్తించి త్వరితగతిన నిర్మాణాలు చేపట్టేలా చూడాలన్నారు. గృహ నిర్మాణ పనితీరుపై అసంతృప్తివ్యక్తం చేశారు. వంద రోజుల్లో మొదటి విడత ఇళ్లను పూర్తి చేసేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మంగతాయారు, తహశీల్దార్ జి.ఎలీషా, హౌసింగ్, పంచాయతీ, రెవెన్యూ, సచివాలయ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

వెంకట్రావుకు పరిహారమిచ్చి ఆదుకుంటాం

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని చింతలవల్లి గ్రామంలో నాశిరకం మొక్కజొన్న విత్తనాలు సాగుచేసి నష్టపోయి ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రైతు వేమూరి వెంకట్రావుకు సంబంధించిన మొక్కజొన్న పంటను మండల వ్యవసాయాధికారులు, మొక్కజొన్న విత్తన కంపెనీ ప్రతినిధులు శనివారం పరిశీలించారు. నూజివీడు రూరల్ మండలం పొలసానిపల్లికి చెందిన వెంకట్రావు చింతలవల్లి గ్రామంలో మొక్కజొన్న సాగుచేశాడు. అయితే కండెలు పూర్తిగా రాకపోవడంతో ఆందోళనకు గురై అదే పొలంలో విషపు గుళికలు మింగి ఇటీవల ఆత్మహత్యకు యత్నించాడు. ప్రస్తుతం నూజివీడు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వెంకట్రావు పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో ముసునూరు మండల వ్యవసాయాధికారి సిహెచ్.శ్రీనివాసరావు సమక్షంలో సిపి కంపెనీ యాజమాన్యం వారితో మాట్లాడారు. ఆతని వైద్య ఖర్చులు భరించి, పంట దిగుబడిని పరిశీలించి, ఆనంతరం నష్ట పరిహారం కుడా ఇస్తామని హామీఇచ్చినట్లు. వీరితోపాటు రైతు సంఘం జిల్లా నాయకులు నిమ్మగడ్డ నరసింహ పాల్గొన్నారు.


పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఆక్వా నకిలీ మందుల తయారీ ముఠా అరెస్ట్

కలిదిండి: ఆక్వా నకిలీ మందులతో రైతులను మోసగిస్తున్న ఆరుగురుని అరెస్ట్ చేసినట్లు కైకలూరు సిఐ వైవివిఎల్.నాయుడు తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రొయ్యల చెరువుల్లో ఉపయోగించే సిబేస్ బయో రెమెడీస్ మందుల తయారీ కంపెనీకి చెందిన నకిలీ లేబుల్స్‌తో రొయ్యల మందులను డీలర్లకు, రైతులకు మార్కెటింగ్ చేస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ముద్దాయిలు నకిలీ లేబుళ్లను గుంటూరుకు చెందిన చిట్టిప్రోలు వెంకట కోటేశ్వరరావుతో తయారు చేయించి, ఆ సంచులను మంచి శ్రీనివాసరావు ద్వారా సయ్యపురెడ్డి మునీంద్రకు చెందిన కంపెనీలో పెట్టారన్నారు. వాటిని కోరుకొల్లు గ్రామానికి చెందిన కేశిరెడ్డి బలరామకృష్ణతో కలిసి డీలర్లకు, రైతులకు సరఫరా చేసినట్లు తెలిసిందన్నారు. షేక్ అక్బర్ ఆలీకి చెందిన వ్యాన్‌లో అతని డ్రైవర్ షేక్ మొహ్మద్‌తో కలిసి రవాణా చేశారని తెలిపారు. సీబేస్ బయో రెమెడీస్‌కు చెందిన రికవరీ మేనేజర్ బండి ఫణి కుమార్ గత నెల ఐదో తేదీన ఫిర్యాదు చేయగా కలిదిండి ఎస్ఐ ఎ.మణి కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారన్నారు. ఆక్వా మందులు తక్కువ ధరకు వస్తున్నాయని దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు సుచించారు. కేసును ఛేదించిన ఎస్ఐ మణికుమార్‌ను స్టేషన్ సిబ్బందిని సిఐ వైవివిఎల్ నాయుడు అభినందించారు.